క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: మండలంలోని నర్సింగపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కుంటాల నర్సయ్య శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గత శాసనసభ ఎన్నికల్లో ట్రక్కు గుర్తుపై స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయగా 13,114 ఓట్లు పొందారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్: మండలంలోని శివపల్లిలో కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన యువకులు కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూసాల నుంచి..

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలకు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్‌లో చేరగా మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మత్స్యశాఖ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీనివాస్, కనకయ్య, గట్టయ్య, శంకర్ ఉన్నారు.

బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి



యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యైటింక్లయిన్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యాదగిరి తిరుపతిని నియమించినట్లు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ శనివారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన నియామక పత్రం అందజేశారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ



దుస్తులు అందిస్తున్న ముత్యాలగౌడ్, శశికళ

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రాపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి శనివారం దుస్తులు అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ మాజీ సర్పంచ్ బుర్ర శశికళ ముత్యాలగౌడ్ దంపతులు గ్రామ పంచాయతీలో ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తాడం చంద్రయ్య, తిప్పారపు కొమురయ్య, లక్ష్మి, వనిత, రాధ, ఎండి అన్వర్, మొత్తం సిబ్బందికి రూ.20వేల విలువ గల దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, నామతాబాద్, బుచ్చయ్య, సాగర్, శ్రావణ్, రాములు, చంద్రయ్య, బోదలు, శ్రీను, గట్టయ్య పాల్గొన్నారు.

అయోడిన్ లోపం నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

జూలపల్లి: అయోడిన్ లోప నివారణపై మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం అనంతరావ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జ్యోతినగర్: పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



మంథని: పూల కొనుగోళ్లతో ప్రధాన చౌరస్తాలో సందడి

సందడిగా పూల కొనుగోళ్లు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ నిర్వహించేందుకు ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నారు. పండగను పురస్కరించుకుని గ్రామాల నుంచి కొందరు పూలు సేకరించి తీసుకొచ్చి పట్టణాలు, నగరాల్లో విక్రయిస్తున్నారు. తంగేడు, గునుగు, టేకు, కలువ, తామర తదితర రకాల పూలకు డిమాండ్ పెరిగింది.

మంథని: సద్దుల బతుకమ్మ సందర్భంగా మంథని సందడిగా మారింది. బతుకమ్మ పేర్చడానికి అవసరమైన పూలు స్థానిక ప్రధాన చౌరస్తాతో పాటు కూరగాయల మార్కెట్, గాంధీచౌక్‌లో సిద్ధంగా ఉంచారు.



పెద్దపల్లిరూరల్: పూలు విక్రయిస్తున్న వ్యాపారులు



కాల్వశ్రీరాంపూర్ సంతలో..

పెద్దపల్లిరూరల్: సద్దుల బతుకమ్మ ఆదివారం కోసం పూలు కొనేందుకు వచ్చిన ప్రజలతో పట్టణంలోని జెండా కూడలి కిటకిటలాడింది. తీరొక్క పూలు విక్రయించారు. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి లారీల్లో బంతి పూలను తెచ్చి అమ్మకాలు సాగించారు.

కాల్వశ్రీరాంపూర్: సద్దుల బతుకమ్మ పండుగ అంటేనే పూలు, రంగులు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ కావడంతో కాల్వశ్రీరాంపూర్‌లో సంతలో పూలు, రంగులు కొనుగోలు చేస్తూ మహిళలు సందడి చేశారు. గునుగు, బంతి, సీత జడ అమ్మకాలు జోరుగా సాగాయి.

శరన్నవరాత్రోత్సవాల్లో ప్రత్యేక పూజలు



జూలపల్లి: పూజల్లో పాల్గొన్న భక్తులు



కమాన్‌పూర్: పూజల్లో పుట్ట మధు



సుల్తానాబాద్: హోమంలో పాల్గొన్న భక్తులు



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో..



ఎలిగేడులో 101 నైవేద్యాలు

జూలపల్లి: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో శనివారం ఏడోరోజు దుర్గామాత శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంజెర్ల వెంకటయ్య, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, కుమ్మరికుంటలో కుంట రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పాతజెండా వద్ద దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు.

లలిత త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత

ఎలిగేడు: మండలంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు భక్తులకు లలిత త్రిపుర సుందరిదేవిగా, సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో అమ్మవారికి 101 నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో దుర్గాదేవి మండపంలో జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. జయ–మానిక్యం దంపతులు అన్నదానం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఎంపీటీసీ నిర్మల పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కొలువైన దుర్గామాతను శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఈద శంకర్‌రెడ్డి

మంథని: నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సీడం బాపుతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మంథనిలోని పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎన్నికల ఇన్‌చార్జి, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మంథని, ముత్తారం, మల్హర్, కాటారం మండలాలకు చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, జెడ్పీచైర్మన్ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులపై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

కేసీఆర్‌తోనే సంక్షేమం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పలు పార్టీలకు చెందిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.

బీఆర్ఎస్‌లోకి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, వెంకట్రావుపల్లెకు చెందిన పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మచ్చ శ్రీనివాస్ శనివారం ఎమ్మె ల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వడ్కాపూర్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన వేల్పుల ఓదెలు, వెంకటేశ్వరరావు, ఆకుల లక్ష్మీనారాయణ, ఆంజనేయులు ఉన్నారు. ఎంపీటీసీ పల్లె స్వరూప, ప్రసాద్, మచ్చ యాదగిరి, రేచవేని మల్లయ్య, మంద స్వామి, రవి, మల్లెత్తుల భూమయ్య, వేల్పుల సందీప్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ఓదెల: పెద్దపల్లిలో మూడోసారి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే తనయుడు దాసరి ప్రశాంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కొలనూర్‌లో శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచాయన్నారు. పెద్దపల్లిలో రోడ్ల నిర్మాణాలు, మంచినీటి సౌకర్యాలు, రైతువేదికలు, వాగులపై వంతెనల నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతుసమన్వయ సమితి డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్, ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచ్ సామ మణెమ్మ, ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, నాయకులు సామ ఢిల్లీ శంకర్ పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న దాసరి ప్రశాంత్‌రెడ్డి

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం



ప్రచారం చేస్తున్న నాయకులు



ప్రచారంలో ఎంపీపీ స్రవంతి

సుల్తానాబాద్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. పట్టణంలోని పూసాలలో శనివారం మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పేదరిక నిర్మూలన బీఆర్ఎస్‌కే సాధ్యమని, దాసరి మనోహర్‌రెడ్డిని మూడోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యం రమేశ్, కలీం, సురేశ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే మరింత అభివృద్ధి

ఎలిగేడు: నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండలంలోని గ్రామ గ్రామాన శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో అన్నివిధాలుగా అభివృద్ధి చేశాం



పెద్దపల్లిరూరల్: పట్టణంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లిని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని ఆమె పేర్కొన్నారు. పెద్దపల్లి చివరి సర్పంచ్ వేముల పద్మావతిని కలిసి ఓటు అభ్యర్థించారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు సన్మానం

జూలపల్లి: బీఆర్ఎస్ నుంచి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వడ్కాపూర్ గ్రామానికి చెందిన, ధూళికట్ట సింగిల్‌విండో అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాలరావును పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గండు సంజీవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ విజయం తథ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. నాయకులు కోరెపు సంపత్, వెంకట్రావుపల్లె మాజీ ఎంపీటీసీ కనుకుంట్ల అంజయ్య, కొండ్ర సంతోష్, అమరగాని సాయి, వేల్పుల లింగయ్య ఉన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందనలు



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖని మారుతినగర్‌లో ఇటీవల అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్న వంగరి సతీశ్(39) అనే యువకుని సంస్మరణ సభ శనివారం వారి నివాసంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి మాట్లాడుతూ సతీశ్ మరణించిన విషాదంలో కూడా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించాలని నేత్రదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం సతీశ్‌కు నివాళి అర్పించారు. అనంతరం సతీశ్ భార్య సుమలత, తల్లిదండ్రులు రాజయ్య, రాజేశ్వరి, సోదరులు సురేశ్, రాజేశ్‌ను అభినందిస్తూ వారికి అభినందన పత్రం అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి కేఎస్ వాసుతోపాటు మామిడాల రవీందర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలను నమ్మొద్దు

- జెడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



ఓటు అభ్యర్థిస్తున్న పుట్ట మధు

ముత్తారం: కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి జెడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హితవుపలికారు. మండలంలోని పోతారం, మైదంబండ, ముత్తారం, కేశనపల్లి, హరిపురంలో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. పోతారం, హరిపురంలో బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల మరణించిన కుటుంబాలను, అనారోగ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలతఅశోక్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, సర్పంచులు వెల్సూరి సంపత్‌రావు, నెత్తెట్ల మహేందర్, నాయకులు బియ్యాని సదానందం, రాజిరెడ్డి, కిషన్‌రెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం

కమాన్‌పూర్: సమాజం కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయమని జెడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి టగ్ ఆఫ్ వార్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కుక్క కుమార్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి స్వచ్ఛంద సంస్థలు నెలకొల్పి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో గుండారం గ్రామానికి చెందిన జనతా గ్యారేజి టీం విన్నర్‌గా నిలిచింది.

కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి



జూలపల్లి: ప్రచారంలో విజయరమణారావు

జూలపల్లి: కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా ఉంటాయని, సత్వర అభివృద్ధికి నోచుకుంటాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణరావు అన్నారు. మండలంలోని కాచాపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటా ముమ్మర ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు ఖాయం



పార్టీలో చేరిన నాయకులతో దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పలువురు నాయకులతో పాటు ఓదెల మండలం మడకకు చెందిన అంబటి కరుణాకర్‌రెడ్డి (రిటైర్డ్ నవోదయ ప్రిన్సిపాల్) బీఎస్పీలో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అక్రమంగా సంపాదించిన సొమ్ముతో మళ్లీ గెలవాలని చూస్తున్నాడని, కాంగ్రెస్ అభ్యర్థి అమలు సాధ్యం కాని హామీలతో ముందుకొస్తున్నారని ఆరోపించారు. ఓటు అనే ఆయుధంతో వారి కుట్రలను భగ్నం చేసేందుకు బహుజన కార్యకర్తలు సైన్యంలా సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. నాయకులు వెంకటేశ్, రవి, శ్రీకాంత్, అభి, అనిల్, రాజయ్య, లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

ఓదెల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి సూచించారు. మండలంలోని జీలకుంట గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాలను పరిశుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తిమాలతి సమ్మిరెడ్డి, ఎంపీడీవో జి.సత్తయ్య, ఎంపీవో వాజీద్, ఏఈఈ సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి



యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్, సిబ్బంది



కమాన్‌పూర్‌లో..



ధర్మారం: నివాళి అర్పిస్తున్న ఎస్సై

జూలపల్లి: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మౌనం పాటించారు.

అమరుల కుటుంబానికి అండగా ఉంటాం

ధర్మారం: ధర్మారం మండలం దొంగతుర్తిలో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు నక్సల్ కాల్పుల్లో అమరుడైన మల్లేశం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచు పాలకుర్తి సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ దాడి సదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఉపసర్పంచు ముత్యాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో అమరుడైన ఎస్.సుబాన్ విగ్రహానికి పోలీసులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్సై బేతి రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండో సీఐ అఫ్జలొద్దీన్, ఎస్సైలు చంద్రశేఖర్, మధుసూదన్, ఫరీద్ నివాళి అర్పించారు. ఏఎస్సైలు రామలక్ష్మి, సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, మల్లేశం, దేవేందర్, శ్యామల, పోలీస్ సిబ్బంది ప్రవీణ్, సురేశ్, భార్గవ్, శ్రీలత పాల్గొన్నారు.